క్లుప్తంగా

సన్మానం



కదిరి అర్బన్: రిపబ్లిక్ డే రోజున అవార్డు అందుకున్న స్థానిక ఆర్టీసీ డిపో మేనేజర్ మైనోద్దీన్‌ను బుధవారం ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు డిపోలో ఘనంగా సన్మానించారు. జిల్లా ఉత్తమ అసిస్టెంట్ ఇంజనీర్‌గా అవార్డు అందుకున్న రామకృష్ణను కూడా సన్మానించారు. డీఎం సేవలను పలువురు నాయకులు కొనియాడారు. కార్యక్రమంలో ఈయూ నాయకులు నబీరసూల్, రీజనల్ సెక్రటరీ జీవైపీ రావ్, సీనియర్ నాయకులు క్రిష్ణయ్య,రీజనల్ నాయకులు ఆర్ఎస్ రెడ్డి,డిపో కార్యదర్శి శంకరప్ప, జీపీఎస్ నాయుడు, సుధీంద్ర, అనిల్, పీఈఖాన్, పీఎస్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయాభివృద్ధికి విరాళం

తనకల్లు: మండల పరిధిలోని తొట్లివారిపల్లిలో నిర్మించిన సీతారామాలయం అభివృద్ధికి ఎమ్మెల్యే డాక్టర్ పీవీ సిద్దారెడ్డి రూ. 50 వేలు అందజేశారు. ఆ మొత్తాన్ని బుధవారం పార్టీ మండల కన్వీనర్ మధుసూదన్‌రెడ్డి చేతుల మీదుగా ఆలయాభివృద్ధి కమిటీ సభ్యులకు అందజేయించారు. సీఆర్ పల్లికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు శ్రీధర్‌రెడ్డి కూడా ఆలయం కోసం రూ. 5 వేలు ఇచ్చారు. కార్యక్రమంలో సర్పంచ్ కృష్ణారెడ్డి, నాయకులు రాజశేఖర్, రామాంజినేయులు, గంగిరెడ్డి, నరసింహులురెడ్డి, లక్ష్మీనర్సురెడ్డి, వెంకటేష్, గ్రామస్థులు పాల్గొన్నారు.

సామూహిక వివాహాలకు దరఖాస్తు చేసుకోండి

కదిరి అర్బన్: కదిరి తాలూకా పరిధిలోని నిరుపేద ముస్లింల ఉచిత సామూహిక వివాహాలకు ఈ నెల 15లోపు దరఖాస్తు చేసుకోవాలని ప్రభుత్వ చీఫ్ ఖ్వాజీ అబ్దుల్ మన్నాన్ శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నెల 28న మైనార్టీ ఫంక్షన్‌హాల్‌లో ఉచిత సామూహిక వివాహాలు జరుగుతాయని తెలిపారు. దరఖాస్తుదారులు వధువు, వరుని ఆధార్‌కార్డు,రేషన్‌కార్డు,ఫోటోలు, ఎస్‌ఓసీ (వయసు ధృవీకరణపత్రం) జిరాక్స్ కాపీలతో పాటు ఇద్దరి ఫోటోలు అందజేయాలన్నారు. వివాహానంతరం దంపతులకు ఉచితంగా ఖురాన్, రిహాన్, జానీమాజ్, దుస్తులు, పెళ్లి కుమార్తెకు బంగారు కల్లీ, కాళ్లకు పట్టీలు, మైజర్, బురఖా,చెప్పులు, ఒక జిప్‌బ్యాగ్, దోమతెర, మేకప్‌బాక్స్, పలంగ్‌బెడ్, బీరువా, ఇస్తారని తెలిపారు. వధూవరుల బంధువులకు (ఇద్దరి తరపున) 60 మందికి ఉచిత భోజన సదుపాయం ఉంటుందన్నారు. వివరాలకు 9440361782 సెల్ నంబర్‌కు సంప్రదించాలని కోరారు.

ఆర్థిక సాయం అందజేత



కదిరి అర్బన్: పట్టణంలోని జీవిమాను సర్కిల్‌లో ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ చాను అనే వ్యక్తికి బుధవారం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి బత్తల హరిప్రసాద్ వైద్య ఖర్చుల నిమిత్తం రూ.10 వేల ఆర్థికసాయం చేశారు. చికిత్స నిమిత్తం తిరుపతికి వెళ్లేందుకు అంబులెన్స్‌ను కూడా ఏర్పాటు చేశారు. నగదును తన తండ్రి బత్తల వెంకటరమణ చేతుల మీదుగా తిరుపతిలోని రమాదేవి ఆసుపత్రిలో చికిత్స తీసుకుంటున్న చానుకు అందజేశారు.

రెడ్డి కల్యాణ మండప నిర్మాణానికి భూమి పూజ

కదిరి అర్బన్: మండల పరిధిలోని కాళసముద్రం సమీపంలో రెడ్డి కల్యాణ మండప నిర్మాణానికి బుధవారం భూమిపూజ నిర్వహించారు. సుమారు రూ.3.75 కోట్లతో కల్యాణ మంటపం నిర్మిస్తున్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే డా. కడపల మోహన్‌రెడ్డి, యోగివేమన కదిరి రెడ్డీస్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు నాగూరి రామచంద్రారెడ్డి, వాల్మీకీ పాఠశాల అధినేతలు పవన్‌కుమార్ రెడ్డి, అనిల్‌కుమార్‌రెడ్డి, దాదెం శివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పుట్టపర్తిలో బెస్త కల్యాణ మండపానికి..

పుట్టపర్తి టౌన్: కర్నాటక నాగేపల్లికి వెళ్లే ప్రధాన రహదారి పక్కన బెస్త కళ్యాణ మండపానికి జిల్లా బెస్త సంఘం నాయకులు భూమి పూజ చేశారు. బుధవారం భీష్మాచారి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి సుమారు రూ. 2 కోట్లతో నిర్మించనున్న మండపానికి భూమి పూజ చేశారు. నాయకులు మాట్లాడుతూ దాతలు సహకరించవచ్చన్నారు. కార్యక్రమంలో సంఘం జిల్లా గౌరవాధ్యక్షులు బయన్న, అధ్యక్షులు జ్యోతి చంద్రశేఖర్, ప్రధాన కార్యదర్శి కేశవ, గౌరవ సలహాదారు చలపతి, నాయకులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో విగ్రహ ప్రతిష్ట

తలుపుల: గంజివారిపల్లి రోడ్డులోని పాలిమేర గంగమ్మ ఆలయంలో విగ్రహ ప్రతిష్టా కార్యక్రమం బుధవారం శాస్త్రోక్తంగా నిర్వహించారు. మంగళవారం రాత్రి బలిజపేట నుంచి విగ్రహాన్ని ఊరేగింపుగా తీసుకెళ్లారు. అన్నదానం నిర్వహించారు. రూరల్ సీఐ శివశంకర్‌నాయక్, ఎంపీపీ రఫినాయక్, మాజీ సర్పంచ్‌లు పురుషోత్తంరెడ్డి, పయాజ్ అహమ్మద్, నారాయణ, ఉత్తయ్య, ఓబులరెడ్డి, క్రిష్ణ, మౌలా తదితరులున్నారు.

పేదల ఖాతాల్లోకి రూ.3 లక్షల కోట్లు

- మూడేళ్లలోనే ప్రజలకు ఎంతో చేశాం
- సంక్షేమాన్ని ప్రతి ఇంటా వివరించండి
- గృహసారథులు, కన్వీనర్లకు ఎమ్మెల్యే సిద్దారెడ్డి పిలుపు



హాజరైన వలంటీర్లు, గృహసారథులు, సచివాలయాల కన్వీనర్లు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే పీవీ సిద్దారెడ్డి

కదిరి అర్బన్: రాష్ట్రవ్యాప్తంగా మూడేళ్లలోనే రూ. 3 లక్షల కోట్ల పైచిలుకు డబ్బును నేరుగా పేదల ఖాతాల్లో తమ ప్రభుత్వం జమ చేసిందని ఎమ్మెల్యే డాక్టర్ పీవీ సిద్దారెడ్డి పేర్కొన్నారు. బుధవారం స్థానిక దత్తా ఫంక్షన్ హాల్, రూరల్ మండలంలోని కుమ్మరవాండ్లపల్లిలో ఉన్న దారుస్సలామ్ ఫంక్షన్ హాల్‌లో వలంటీర్లు, గృహసారథులు, కన్వీనర్లతో ఎమ్మెల్యే సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ అధికారంలోకి వచ్చాక 4 లక్షల పైచిలుకు వలంటీర్లు, సచివాలయ ఉద్యోగాలు కల్పించామన్నారు. ఈ నెల 11 నుంచి ప్రతి ఇంటికీ వలంటీర్లు, గృహసారథులు వెళ్లి ప్రభుత్వం నుంచి అందుతున్న సంక్షేమ పథకాలను వారికి వివరించాలని పిలుపునిచ్చారు. జగనన్న చేపట్టిన సంక్షేమ పథకాలకు సంతృప్తి చెందినట్లయితే ఒక వీడియోను తీసుకుని జేసీఎస్ గ్రూపులో అప్‌లోడ్ చేయాలని చెప్పారు. రాష్ట్రంలో పేదలకు, పెత్తందార్లకు మధ్య యుద్ధం జరుగుతోందన్నారు. ఈ యుద్ధంలో వచ్చుమీడియా పెత్తందార్లకు వత్తాసు పలుకుతోందన్నారు. మనకున్నదంతా ప్రజాబలమేనన్నారు. టీడీపీ పాలనలో గ్రామాల్లో ఒక్క ప్రభుత్వ కార్యాలయం కూడా కట్టలేదని, నేడు ఏ గ్రామానికి వెళ్లిన భవనాలు కనిపిస్తున్నాయన్నారు. నాడు –నేడు పథకంతో బడులు కార్పొరేట్ స్థాయికి తీసుకొచ్చామన్నారు. చెరువులను నీటితో నింపి సాగుకు సాయం చేశామని చెప్పారు. మరోసారి వైఎస్సార్ సీపీని గెలిపించాల్సిన బాధ్యత వలంటీర్లు, గృహ సారథులు, కన్వీనర్లపై ఉందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ అమరనాథ్‌రెడ్డి, జెడ్పీటీసీ రాధాబాయ్, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ ప్రకాష్, కదిరి మండల సచివాలయాల కన్వీనర్ మధుసూదన్‌రెడ్డి, వైస్ ఎంపీపీ దానంద్‌నాయక్ తదితరులున్నారు.

నేడు ఎన్‌పీ కుంటలో

ఎన్‌పీకుంట: మండల పరిధిలోని ధనియానిచెరువు సచివాలయం ఆవరణలో గురువారం గృహసారథులకు శిక్షణా కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీపీ ఈటె రాము ఒక ప్రకటనలో తెలిపారు. మధ్యాహ్నం 2 గంటలకు ప్రారంభమయ్యే కార్యక్రమానికి ఎమ్మెల్యే డాక్టర్ పీవీ సిద్దారెడ్డి ముఖ్యఅతిథిగా హాజరవుతారని పేర్కొన్నారు.

సచివాలయాలతో ప్రజల చెంతకే పాలన

కదిరి: సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సచివాలయాలతో పాలనను ప్రజల చెంతకే తెచ్చారని ఎమ్మెల్యే డాక్టర్ పీవీ సిద్దారెడ్డి పేర్కొన్నారు. 'గడప గడపకూ మన ప్రభుత్వం' కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే బుధవారం పట్టణంలోని 7వ వార్డులో పర్యటించారు. గడప గడపకూ వెళ్లి సంక్షేమ ఫలాలు ఎలా అందుతున్నాయో ఆరా తీశారు. జగన్ పాలన పట్ల ప్రజలు సంతోషం వెలిబుచ్చారు. గత టీడీపీ పాలనలో అర్హులైనప్పటికీ సంక్షేమ ఫలాలు అందాలంటే టీడీపీ నాయకుల చుట్టూ తిరగాల్సి వచ్చేదని, ఇప్పుడు ఆ పరిస్థితి లేదన్నారు. అర్హులందరికీ ఎలాంటి సిఫారసు లేకుండానే సంక్షేమ ఫలాలు అందుతున్నాయని సంతోషం వ్యక్త పరిచారు. కొన్ని వీధుల్లో ప్రజలు ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చిన సమస్యలు కొన్నింటిని అక్కడికక్కడే పరిష్కరించారు. ఇంకొన్ని త్వరిత గతిన పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. అనంతరం ఎమ్మెల్యే మీడియాతో మాట్లాడారు. ప్రజల సమస్యలు పాదయాత్ర ద్వారా తెలుసుకొని,అధికారంలోకి రాగానే చెప్పిన హామీలన్నీ నెరవేర్చిన ఘనత సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డికే దక్కుతుందన్నారు. జగన్ పాలనపై ఎల్లో మీడియాలో వచ్చే అసత్యపు వార్తలు నమ్మరాదన్నారు. ముఖ్యమంత్రి అవినీతి రహిత పాలన అందిస్తున్నారని స్పష్టం చేశారు. దేశంలో ఏ రాష్ట్రంలో లేనన్ని సంక్షేమ పథకాలు ఏపీలో అమలు చేస్తున్నామన్నారు. దేశానికే ఏపీ రోల్ మోడల్ అని పేర్కొన్నారు. ఎవరెన్ని కుట్రలు చేసినా సంక్షేమ పథకాలు ఆపలేరన్నారు. కార్యక్రమంలో 7వ వార్డు కౌన్సిలర్ కిన్నెర కళ్యాణ్, మున్సిపల్ వైస్ చైర్మన్ రాజశేఖర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు ఎస్ఎండీ ఇస్మాయిల్, పరికి సాదిక్‌బాషా, కమిషనర్ శ్రీహరిబాబు, పలువురు కౌన్సిలర్లు, పలు శాఖల మున్సిపల్, సచివాలయ ఉద్యోగులు, వార్డు వలంటీర్లు పాల్గొన్నారు.

నేడు 4వ వార్డులో..

గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే డా.పీవీ సిద్దారెడ్డి గురువారం ఉదయం 7 గంటల నుంచి 4వ వార్డులో పర్యటిస్తారని ఆ వార్డు కౌన్సిలర్ లింగాల కృపాకర్ రెడ్డి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. మున్సిపల్ చైర్‌పర్సన్, వైస్ చైర్మన్‌లు, తోటి కౌన్సిలర్లు, అన్ని ప్రభుత్వ శాఖల ఉద్యోగులు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు హాజరు కావాలని కోరారు.

ఘనంగా వసంతోత్సవం



ధర్మవరం అర్బన్: పట్టణంలోని మార్కెట్‌వీధిలోనున్న మార్కండేయస్వామి ఆలయంలో బుధవారం పద్మశాలీయ బహుత్తమ సంఘం ఆధ్వర్యంలో భద్రావతి భావనా రుషీంద్రులకు వసంతోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. సంఘం అధ్యక్షుడు జక్కా చిన్న శింగరయ్య, ఉపాధ్యక్షులు జింకా రామంజినేయులు, గోలి నాగభూషణ, ప్రధాన కార్యదర్శి జింకా చిన్నప్ప, సహాయ కార్యదర్శి బోడగల శంకర్, కోశాధికారి పొరాళ్ల పుల్లయ్య, కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం డోలికోత్సవాన్ని నిర్వహించారు. అన్నమయ్య సేవా మండలి అధ్యక్షుడు పొరాళ్ల పుల్లయ్య బృందం సంకీర్తనలు అమితంగా ఆకట్టుకున్నాయి.

ఇంటర్ యూనివర్సిటీ హ్యాండ్‌బాల్ పోటీలకు ఎంపిక

పుట్టపర్తి అర్బన్: తమిళనాడు రాష్ట్రం పెరియార్ యూనివర్సిటీలో ఈనెల 4న జరగనున్న ఇంటర్ యూనివర్సిటీ హ్యాండ్‌బాల్ పోటీలకు జగరాజుపల్లి మంగళకర ఎడ్యుకేషన్ ఇన్‌స్టిట్యూట్‌కు చెందిన బీబీఏ విద్యార్థి అరవింద్ ఎంపికయ్యాడు. బుధవారం కళాశాల కరస్పాండెంట్ సురేష్‌కుమార్, ఏఓ జయచంద్రారెడ్డి, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ రమేష్‌బాబు, పీడీ శ్రీనివాసులు విద్యార్థిని అభినందించారు.

విద్యార్థులు లక్ష్యంతో ముందుకెళ్లాలి

ధర్మవరం అర్బన్: ప్రతి విద్యార్థి లక్ష్యంతో ముందుకు వెళ్లాలని అప్పుడే విజయం సాధ్యమని మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున, ఎంఈఓ సుధాకర్‌నాయక్ పేర్కొన్నారు. పట్టణంలోని బీఎస్ఆర్ మున్సిపల్ బాలికల ఉన్నత పాఠశాలలో బుధవారం పదో తరగతి విద్యార్థులకు అదనపు తరగతులు సాయంత్రం పూట నిర్వహిస్తుండటంతో అల్పాహారాన్ని అందించే కార్యక్రమాన్ని ప్రారంభించారు. వారు మాట్లాడుతూ విద్యార్థులు పదో తరగతిలో చదువు మీద దృష్టి పెట్టాలన్నారు. ఆటపాటలకు స్వస్తి పలికి ఏకాగ్రతతో ఇష్టంతో చదివితే విజయం తప్పక లభిస్తుందని తెలిపారు. తల్లిదండ్రుల ప్రోత్సాహం కూడా ఎంతో అవసరమని తెలిపారు. ఉపాధ్యాయులు విద్యార్థులందరూ ఉత్తీర్ణత సాధించేలా కృషి చేయాలని చెప్పారు. అనంతరం విద్యార్థులకు అల్పాహారం అందించారు. పాఠశాల హెచ్ఎం ఉమాపతి, కౌన్సిలర్లు నీలూరు వెంకట్రాముడు, కేతా లోకేష్, మాజీ కౌన్సిలర్ బీరే ఎర్రిస్వామి, విద్యా కమిటీ చైర్మన్ రమణ, వైస్ చైర్మన్‌లు నూర్జహాన్, బాబ్జాన్, ఉపాధ్యాయులు కమిషనర్‌ను శాలువతో సత్కరించారు.

జోరుగా పింఛన్ల పంపిణీ



బత్తలపల్లిలో తెల్లవారుజామునే పింఛన్ అందజేస్తున్న వలంటీర్ కాటమయ్య

బత్తలపల్లి: మండలంలో సామాజిక పింఛన్ల పంపిణీ ప్రారంభమైంది. బుధవారం ఉదయానికే 50 శాతం పింఛన్లు పంపిణీ కావడం గమనార్హం. ఉదయం సర్వర్లు బిజీగా ఉంటాయన్న ఉద్దేశంతో మండలంలో కొందరు వలంటీర్లు తెల్లవారుజాము 4 గంటల నుంచే పంపిణీని ప్రారంభించారు. మండలంలో వృద్ధాప్య, వితంతు, వికలాంగ తదితర సామాజిక పింఛన్లు మొత్తం 6,268 ఉన్నాయి. బుధవారం సాయంత్రం 4 గంటలకల్లా 5,079 మందికి పంపిణీ చేశారు. పనులకు వెళ్లి వచ్చిన వారికి పంపిణీ చేయగా రాత్రికి 90 శాతంపైగా పూర్తైంది. ఆసుపత్రిలోనూ, ఉపాధి పనుల వద్ద, పొలాల వద్దకు వెళ్లి పింఛన్లు అందించడంతో లబ్ధిదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

పెన్షన్లు పంపిణీ చేసిన వలంటీర్లు

కదిరి టౌన్: మున్సిపల్ పరిధిలోని 36 వార్డుల్లో 9,490 పెన్షన్‌దారులకు రూ. 2 కోట్ల 66 లక్షల 126 నగదును వలంటీర్లు ఉదయం 6 గంటలకే అందజేశారు. గత ప్రభుత్వంలో పెన్షన్ కావలంటే పడిగాపులు కాయాల్సిన దుస్థితి. ఈ ప్రభుత్వంలో పెన్షన్‌దారుల ఇంటికే వచ్చి అందిస్తుండడంతో లబ్ధిదారులు సంతోషం అంతా ఇంతా కాదు.

స్నేహితుల ఔదార్యం

తనకల్లు: తమతో పాటు కలిసి చదువుకున్న మిత్రుడి తల్లికి వైద్య చికిత్స కోసం పూర్వ విద్యార్థులంతా కలిసి రూ. 16 వేలు అందజేసి ఔదార్యం చాటారు. తామందరం తనకల్లు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 2007లో పదో తరగతి వరకు కలిసి చదువుకున్నామన్నారు. మిత్రుడు నాగభూషణ తల్లి అనారోగ్యానికి గురి కావడం, అతని ఆర్థికస్థితి సరిగా లేకపోవడంతో వైద్యం కోసం తమవంతు సాయం చేశామని తెలిపారు. కార్యక్రమంలో ఇమ్రేజ్, సమీవుల్లా, సుదర్శన్, రెడ్డిరాణి, లక్ష్మీ, భారతి, రేవతి తదితరులు పాల్గొన్నారు.

రూ. కోట్ల స్థలాన్ని కొట్టేశారు

రియల్టర్ల బరితెగింపు

- ప్రభుత్వ స్థలంలో రోడ్డు వేసిన వైనం
- నిద్రమత్తులో రెవెన్యూ యంత్రాంగం



ప్రభుత్వ స్థలంలో నుంచి వేసిన తారురోడ్డు

కదిరి అర్బన్: కదిరి మండలం కబ్జాదారులకు వరంలా మారింది. మున్సిపాల్టీ చుట్టూ మండలం ఉండడంతో భూముల ధరలు అమాంతం పెరిగిపోయాయి. బైపాస్‌రోడ్డు కూడా మండలంలో కొన్ని కిలోమీటర్ల మేర పోవడంతో స్థలాల రేట్లకు రెక్కలొచ్చాయి. దీంతో ఎక్కడెక్కడ ప్రభుత్వ భూములు ఉన్నాయో అక్కడ కబ్జాదారులు వాలిపోతున్నారు. కదిరి గ్రామపొలం సర్వే నెంబర్ 124లో బైపాస్ రోడ్డుకు ఆనుకుని 15 సెంట్ల ప్రభుత్వ భూమి ఉంది. పక్కనే అక్రమ లేఅవుట్‌లు వేసిన రియల్టర్ల కన్ను ఈ భూమిపై పడింది. వెంటనే ఆ స్థలంలో తారురోడ్డు వేసేశారు. బైపాస్ నుంచి నేరుగా వెంచర్లలోకి రోడ్డు వేసుకున్నారు. తమ ప్లాట్లను రెట్టింపు ధరతో విక్రయించుకుంటున్నారు. రెవెన్యూ అధికారులతో కుమ్మక్కై తారురోడ్డు వేశారని పలువురు బాహాటంగా విమర్శిస్తున్నారు.

తహసీల్దార్ ఎప్పుడొస్తారో ఎవరికీ తెలీదు..

బుక్కపట్నం మండల తహసీల్దార్ నటరాజ్‌ను కదిరి మండలానికి ఇన్‌చార్జ్‌గా ఉన్నతాధికారులు నియమించినా ఆయన ఇక్కడ విధులు నిర్వహించేందుకు సుముఖంగా లేనట్లు తెలుస్తోంది. దీంతో చిన్న చిన్న పనులపై తహసీల్దార్ కార్యాలయానికి వచ్చే ప్రజలు రోజుల తరబడి వేచి ఉండాల్సిన పరిస్థితి.

కిందిస్థాయి అధికారులు ఆడిందే ఆట..

తహసీల్దార్ చుట్టపుచూపుగా వస్తుండడంతో కింది స్థాయి అధికారులు ఆడింది ఆట పాడింది పాటగా మారింది. బైపాస్ రోడ్డు చుట్టుపక్కల ఎక్కడెక్కడ, ఏఏ సర్వేనెంబర్‌లో ప్రభుత్వ భూములు ఉన్నాయో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ మున్వర్‌కు బాగా తెలుసు. ఆయా భూములను కొందరు కబ్జాచేస్తుంటే ఆయన పట్టించుకోకపోవడం గమనార్హం. డిప్యూటీ తహసీల్దార్‌గా పదోన్నతి వచ్చినా వెళ్లకుండా ఇక్కడే ఆర్ఐగా కొనసాగుతుండడం కొసమెరుపు. కబ్జా విషయమై తహసీల్దార్‌ను సంప్రదిస్తే ఫోన్‌లో కూడా అందుబాటులోకి రాలేదు.

ఫిర్యాదు చేసినా పట్టించుకోరు..

గతంలోనూ బైపాస్ చుట్టూ ప్రభుత్వ భూమిని కబ్జా చేశారని పలువురు రెవెన్యూ అధికారులకు రాతపూర్వకంగా సర్వే నెంబర్లతో సహా ఫిర్యాదు చేశారు. ఇంతవరకూ వాటిపై ఎలాంటి చర్యలు తీసుకోలేదు. సర్వే నెంబర్ 123లో 20 సెంట్లు, 148ఏలో 12.32 సెంట్లు, 149–3లో 28 సెంట్లు, 185లో 89 సెంట్లు, 192–2లో 8.12 సెంట్లు,188–2,2బీలో 8.45 సెంట్లు,149–2లో 30 సెంట్ల స్థలం కబ్జా చేశారని ఆధారాలతో సహా ఫిర్యాదు చేసినా అధికారులు పట్టనట్లే వ్యవహరిస్తున్నారు.

ఫ్యామిలీ ఫిజీషియన్ సేవలు వినియోగించుకోవాలి

కనగానపల్లి: ఫ్యామిలీ ఫిజీషియన్ సేవలను గ్రామీణ ప్రాంత ప్రజలు వినియోగించుకోవాలని కనగానపల్లి పీహెచ్‌సీ డాక్టర్ భానురేఖ సూచించారు. బుధవారం మండలంలోని కేఎన్ పాళ్యం గ్రామంలో 104 వాహనం ద్వారా ఫ్యామిలీ ఫిజీషియన్ సేవలందించారు. ఈ సందర్భంగా దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులు, వృద్ధులు, బాలింతలు, గర్భిణుల ఇళ్ల వద్దకే వెళ్లి వైద్య సేవలు అందించారు. అనంతరం స్థానిక అంగన్‌వాడీ కేంద్రం, పాఠశాలలో వైద్య శిబిరాలు ఏర్పాటుచేసి విద్యార్థులకు వైద్య సేవలందించారు. దీంతోపాటు కుష్టువ్యాధిపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సీహెచ్ఓ మౌనిక, హెల్త్ సూపర్ వైజర్ శ్రీనివాసులు, ఆరోగ్య కార్యకర్తలు, 104 సిబ్బంది ఉన్నారు.

శభాష్ జయరామిరెడ్డి



చైర్‌పర్సన్, కమిషనర్‌కు స్థలం డాక్యుమెంట్లు అందిస్తున్న కౌన్సిలర్ జయరామిరెడ్డి

ధర్మవరం: ఎన్నికల ముందు ప్రజలకిచ్చిన మాటను నిలబెట్టుకున్నారు వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్ జయరామిరెడ్డి. రూ.12 లక్షలతో రోడ్డు కోసం స్థలం కొనుగోలు చేసి అందరితో శభాష్ అనిపించుకున్నారు. ధర్మవరం పట్టణంలోని 2వ వార్డులో మున్సిపల్ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ తరపున వేముల జయరామిరెడ్డి కౌన్సిలర్‌గా గెలుపొందారు. అప్పట్లో స్థానికంగా రహదారి సమస్య ఉండటంతో తీరుస్తానని మాట ఇచ్చారు. వాగ్దానాన్ని మరువకుండా రహదారికి అడ్డంగా ఉన్న స్థలాన్ని రూ.12 లక్షల సొంత డబ్బుతో కొనుగోలు చేశారు. ఆ స్థలం డాక్యుమెంట్లను బుధవారం మున్సిపల్ చైర్‌పర్సన్ లింగం నిర్మల, కమిషనర్ మల్లికార్జునకు జయరామిరెడ్డి అందించారు. రహదారి నిర్మించి వార్డు ప్రజల రాకపోకలకు సౌకర్యం కల్పించాలని కోరారు. చైర్‌పర్సన్, కమిషనర్, కౌన్సిలర్లు ఆయనను అభినందించారు.

పాదయాత్రగా తిరుమలకు...

రామగిరి: మండలంలోని పేరూరు గ్రామానికి చెందిన 20 మంది భక్తులు బుధవారం తిరుమలకు పాదయాత్రగా బయలుదేరి వెళ్లారు. ఉదయాన్నే ఆంజనేయస్వామి, ఈశ్వరదేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పేరూరు నుంచి పాదయాత్రగా బయలుదేరి రాగిమేకలపల్లి, గోరంట్ల, వాయల్పాడు, పీలేరు మీదుగా మొత్తం 320 కి.మీ పాదయాత్ర చేసి తిరుమలకు వెళ్తామన్నారు. 8 రోజులపాటు సాగే ఈ పాదయాత్రలో మోహన్‌స్వామి, నాగరాజు, గౌనిగోపాల్, వెంకటరెడ్డి, సత్యనారాయణ తదితరులు ఉన్నారు.

సంక్షిప్త సమాచారం

ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు

కొత్తచెరువు: ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి చొరవతో పాఠశాల వద్ద విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేశారు. మండల పరిధిలోని కేశాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు విద్యుత్ అంతరాయం ఏర్పడుతుండడంతో విషయాన్ని ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్ రెడ్డి దృష్టికి ఉపాధ్యాయులు తీసుకెళ్లారు. స్పందించిన ఎమ్మెల్యే వెంటనే ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. దీంతో ఏఈ వెంకటేష్ నాయక్ యుద్ధప్రాతిపదికన చర్యలు తీసుకొని ట్రాన్స్ ఫార్మర్‌ను బుధవారం ఏర్పాటు చేశారు.

సర్వే వేగవంతం చేయండి

నల్లచెరువు: ఆయుష్మాన్ భారత్ సర్వేని వేగవంతం చేయాలని ఎంపీడీఓ శకుంతల అన్నారు. మండల పరిధిలోని తలమర్లవాండ్లపల్లి సచివాలయాన్ని బుధవారం ఆమె తనిఖీ చేశారు. రికార్డులు, రిజిస్టర్లను పరిశీలించారు. విధుల్లో నిర్లక్ష్యంగా ప్రవర్తిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యదర్శి రమణప్పనాయుడు, వెల్ఫేర్ అసిస్టెంట్ హనుమంతు, డిజిటల్ అసిస్టెంట్ ప్రసాద్ పాల్గొన్నారు.

బదిలీ ఉపాధ్యాయునికి ఘన సత్కారం

నల్లచెరువు: నడింపల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో పనిచేస్తూ ఇతర ప్రాంతానికి బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయుడు మధుసూదన్‌రావుకు బుధవారం పాఠశాలలో దుశ్శాలువాలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో నల్లచెరువు, తలుపుల ఎంఈఓలు తిరుపాల్‌నాయక్, వెంకటరాముడు, ఉపాధ్యాయులు షబ్బీర్, ఇంద్రప్రసాద్, కాంప్లెక్స్ చైర్మన్ సుబ్బిరెడ్డి, విద్యార్థులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

వైఎస్సార్ బీమా తక్షణసాయం అందజేత

తనకల్లు: నక్కరాళ్లతండాలో ఇటీవల గుండెపోటుతో మృతి చెందిన బాలాజీనాయక్ కుటుంబ సభ్యులకు సర్పంచ్ శైలజ బుధవారం వైఎస్సార్ బీమా తక్షణ సాయం కింద రూ. 10 వేలు అందజేశారు. ఎంపీటీసీ శ్రీనివాసులు, కార్యదర్శి చంద్రానాయక్, వెల్ఫేర్ అసిస్టెంట్ సుధాకర్ వలంటీర్లు ఉన్నారు.

పౌష్టికాహారం సక్రమంగా అందించాలి

తలుపుల: అంగన్‌వాడీ సెంటర్లకు అందిస్తున్న పౌష్టికాహారాన్ని సక్రమంగా అందించాలని సీడీపీఓ శశికళ అంగన్‌వాడీ కార్యకర్తలకు సూచించారు. మండల కేంద్రంలోని అంగన్‌వాడీ సెంటర్ –1,3, కుమ్మరపేట–4లను బుధవారం ఆమె అకస్మికంగా తనిఖీ చేసి, ప్రీస్కూల్ పిల్లలకు అందిస్తున్న భోజనాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ నిహారిక, అంగన్‌వాడీ కార్యకర్తలు లక్ష్మి,సుశీల, సునీత తదితరులు పాల్గొన్నారు.

ఎలక్ట్రికల్ సామగ్రి వితరణ

ధర్మవరం: స్థానిక మున్సిపల్ కార్యాలయంలో బుధవారం కమిషనర్ మల్లికార్జునకు మాజీ ఆర్మీ ఉద్యోగి సతీష్ రూ.25వేలు విలువ చేసే ఎలక్ట్రికల్ పనిముట్లను అందించి దాతృత్వాన్ని చాటుకున్నారు. కార్యక్రమంలో మున్సిపల్ ఇంజినీరింగ్ ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

హుండీ ఆదాయం రూ.2.52 లక్షలు

కదిరి అర్బన్: మండల పరిధిలోని యర్రదొడ్డి గంగమ్మ ఆలయంలో బుధవారం హుండీ లెక్కింపు నిర్వహించారు. రూ. 2,52,380 ఆదాయం వచ్చినట్లు ఆలయ కమిటీ చైర్మన్ నరసారెడ్డి, ఈఓ రామాంజినేయులు తెలిపారు.

శేష వాహనంపై వేంకటేశ్వరస్వామి

ధర్మవరం అర్బన్: పట్టణంలోని కొత్తపేట లక్ష్మీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో 16వ వార్షిక బ్రహ్మోత్సవాలలో భాగంగా బుధవారం శేష వాహనంపై స్వామివారు పురవీధుల్లో ఊరేగారు. స్వామిని దర్శించుకునేందుకు భక్తులు పెద్ద ఎత్తున తరలి వచ్చి ప్రత్యేక పూజలు చేశారు.

కూలి కనీసం రూ.257 వచ్చేలా పని చేయాలి

ఓడీ చెరువు: మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా కూలీలకు రోజువారి కనీసం రూ. 257 వచ్చేలా పనులు చేయాలని ఏపీడీ శ్రీనివాసరెడ్డి, ఎంపీడీఓ పోలప్ప అన్నారు. బుధవారం మండలంలోని బాబాసాహెబ్‌పల్లిలో సరిహద్దు కందకాల పనులను పరిశీలించారు.

రక్తదానం ప్రాణదానంతో సమానం

ధర్మవరం అర్బన్: రక్తదానంతో ప్రాణాపాయస్థితిలో ఉన్న పలువురికి ప్రాణదానం చేసినట్లేనని వన్‌టౌన్ సీఐ సుబ్రమణ్యం తెలిపారు. పట్టణంలోని సిద్దయ్యగుట్టలోని తిక్క నారాయణస్వామి ఆలయంలో 51వ ఆరాధన మహోత్సవాలను బుధవారం నిర్వహించారు. రక్తదాన శిబిరాన్ని సీఐ సుబ్రమణ్యం ప్రారంభించారు. రక్తదానం చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు నాగరాజు, అన్న లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

రేపు సర్వసభ్య సమావేశం

తాడిమర్రి: మండల సర్వసభ్య సమావేశం శుక్రవారం ఉదయం 10 గంటలకు తాడిమర్రి మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ పాటిల్ భువనేశ్వర్‌రెడ్డి అధ్యక్షతన ఏర్పాటు చేసినట్లు ఎంపీడీఓ విజయలక్ష్మీ తెలిపారు. ప్రజా ప్రతినిధులు, అధికారులు సమావేశానికి హాజరు కావాలని కోరారు.

సబ్సిడీపై పండ్ల మొక్కలు

ధర్మవరం రూరల్: చిగిచెర్ల ప్రభుత్వ నర్సరీలో మామిడి, చీనీ, సీతా ఫలం మొక్కలు సబ్సి డీతో అందిస్తున్నట్లు హార్టికల్చర్ అసిస్టెంట్ భార్గవ తెలిపారు. నర్సరీలో సంప్రదించాలని కోరారు.

మోసం చేశారని రియల్టర్‌పై ఫిర్యాదు

నల్లచెరువు: కదిరి పట్టణానికి చెందిన రియల్టర్ నూర్‌బాషా తమని మోసం చేశాడని కదిరికి చెందిన పలువురు బుధవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. నల్లచెరువు మండలం అల్లుగుండు జాతీయ రహదారి పక్కన రియల్టర్ నూర్‌బాషా సర్వే నెంబర్ 230లో వెంచర్ వేసి ప్లాట్‌లను అమ్మకానికి పెట్టినట్లు తెలిపారు. ఆ వెంచర్‌లో కదిరి పట్టణానికే చెందిన అప్సర్, అన్వర్‌ఖాన్, జబీవుల్లాఖాన్, షాకీర్, బాబాఫకృద్దీన్, అంజాద్, జాఫర్‌ఖాన్, సాధిక్‌అలీ, నూరుల్లాఖాన్ ఐదేళ్ల క్రితం ప్లాట్లు కొనుగోలు చేసినట్లు పేర్కొన్నారు. నూర్‌బాషా ఇంతవరకు తమకు స్థలాన్ని చూపడం లేదని వాపోయారు. తమ స్థలాన్ని అప్పగించేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

ఘనంగా ఊరేగింపు

చెన్నేకొత్తపల్లి: గాండ్లకులస్తుల ఆరాధ్య దైవం భైరవ స్వామి పల్లకీ ఊరేగింపును బుధవారం భక్తిశ్రద్ధలలో ఘనంగా నిర్వహించారు. ఉదయం ఆలయంలో మూలవిరాట్ కు ప్రత్యేక పూజల అనంతరం స్వామివారిని పల్లకీలో కొలువుదీర్చి ఊరేగించారు.

సీపీఐ కమిటీ ఎంపిక

కనగానపల్లి: సీపీఐ మండల నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎంపిక చేసినట్లు ఆ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి జేవీ రమణ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల కార్యదర్శిగా బాలరాజు, సహాయ కార్యదర్శులుగా మల్లికార్జున, నాగరాజు, కమిటీ సభ్యులుగా వీరయ్య, పి. రాములను ఎన్నుకున్నారు. సీపీఐ జిల్లా కార్యవర్గ కమిటీ సభ్యుడు మహాదేవ, తదితరులున్నారు.